నిబంధనలకు నీళ్లు



ప్రధాన రైల్వేస్టేషన్‌లో లూజ్ వాటర్ స్టాల్



రైల్వేస్టేషన్‌లో దుకాణాలు

- అధిక ధరకు వాటర్ బాటిళ్ల విక్రయం
- ప్రధాన రైల్వేస్టేషన్‌లో దోపిడీ
- పట్టించుకోని అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రధాన రైల్వేస్టేషన్‌లో తాగునీటి దోపిడీ జరుగుతోంది. ఏవిధమైన నిబంధనలు పాటించకుండా వ్యాపారం సాగిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో ప్రయాణికులు నష్టపోతున్నారు. విజయవాడ తర్వాత అత్యంత ప్రధానమైన రైల్వేస్టేషన్ రాజమహేంద్రవరం. దీని మీదుగా నిత్యం 140 ప్రయాణికుల రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. వీటిలో సుమారు లక్ష మంది ప్రయాణిస్తుంటారు. రాజమహేంద్రవరం స్టేషన్ నుంచి సుమారు రూ.30 వేల మంది రాకపోకలు సాగిస్తారని అంచనా. స్టేషన్‌లో రైళ్లు ఆగేది కేవలం ఐదు నిమిషాలలోపు మాత్రమే. దీంతో హడావుడిగా వచ్చే ప్రయాణికుల నుంచి వ్యాపారులు అసలు ధర కన్నా రూ.5 అదనంగా వసూలు చేస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో లీటర్ కిన్‌లే/బిస్లరీ బాటిల్‌ను రూ.15కు (రైల్వే సబ్సిడీ రేటు) విక్రయించాలి. కానీ రూ.5 అదనంగా కలిపి, రూ.20 వసూలు చేస్తున్నారు. నిత్యం సుమారు పదివేల బాటిళ్ల విక్రయిస్తారు. దీని ద్వారా రోజుకు రూ.రూ.50 వేలు, నెలకు రూ.15 లక్షల మేర ప్రయాణికులు దోపిడీకి గురవుతున్నారని అంచనా. తాగునీరు, తినుబండారాల విక్రయాలు సాగించేందుకు స్టేషన్లో ఎనిమిది స్టాళ్లు ఉన్నాయి.

లూజ్ వాటర్ అమ్మకాల్లోనూ..

సాధారణ ప్రయాణికుల సౌకర్యార్థం జనరల్ బోగీలు ఆగే ప్రాంతాల్లో (ప్లాట్‌ఫాంకు అటువైపు ఇటువైపు) ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఐజనిక్ లూజ్ కూలింగ్ వాటర్ పాయింట్లు ఏర్పాటు చేశారు. సాధారణ ప్రయాణికులకు తక్కువ ధరకు నీరు అందించాలన్నదే వీటి లక్ష్యం. అయితే లీటర్ నీటిని రూ.5కు అమ్మాల్సి ఉండగా, రూ.6కు విక్రయిస్తున్నారు. బాటిల్‌తో అయితే రూ.8లకు అమ్మాల్సి ఉండగా, రూ.10 వసూలు చేస్తున్నారు. ధరల వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయకుండా విక్రయాలు జరుపుతున్నారు. అర లీటర్ నుంచి 5 లీటర్ల బాటిల్ వరకూ అందుబాటులో ఉంచాల్సిన నిర్వాహకులు లీటర్ బాటిళ్లు (900 ఎంఎల్) మాత్రమే అందుబాటులో ఉంచారు. లీటర్ బాటిల్ పేరుతో 100 ఎంఎల్ వాటర్ తక్కువగా అందిస్తున్నారు. ఈ స్టాళ్ల ద్వారా నిత్యం ఐదువేల లీటర్లు పైబడి అమ్మకాలు సాగిస్తుంటారు. కాగా.. ఈ దోపిడీ విషయంపై రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ కుమార్‌ను వివరణ కోరగా ఆ విషయం తమ పరిధిలో లేదన్నారు.

యథేచ్ఛగా దోపిడీ



రైల్వే స్టేషన్‌లో నీళ్ల దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. బాటిల్‌ను రూ.5 అధిక ధరకు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. విజయవాడ డివిజనల్ స్థాయి అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

– లంక సత్యనారాయణ, పీస్ ఫర్ పీపుల్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్స్ అధ్యక్షుడు, రాజమహేంద్రవరం

వలంటీర్లకు వందనం

అంధురాలికి ఆసరా



సరోజినీదేవికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటరావు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామానికి చెందిన మెర్ల సరోజినీదేవి అంధురాలు. రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు దివ్యాంగుల పింఛన్ అందిస్తోంది. గతేడాది డిసెంబర్ నుంచి కొండగుంటూరులోని వృద్ధాశ్రమంలో ఉంటోంది. దీంతో ప్రతి నెలా ఒకటో తేదీన రాజవోలు గ్రామసచివాలయం–2 వలంటీర్ పాముల వెంకటరావు (వెంకట్) కొండగుంటూరులోని వృద్ధాశ్రమానికి వెళ్లి సరోజినీదేవికి పింఛన్ అందిస్తున్నాడు. రాజవోలు గ్రామంలో లేనప్పటికీ కొండగుంటూరు వృద్ధాశ్రమంలో ఉన్న తనకు వలంటీర్ పింఛన్ సొమ్ము అందించడంతో ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది.

సేవలు అభినందనీయం

రాజవోలు గ్రామానికి చెందిన సరోజినీదేవికి పింఛన్‌ను వలంటీర్ పాముల వెంకటరావు ప్రతినెలా కొండగుంటూరు వృద్ధాశ్రమానికి వెళ్లి అందిస్తున్నాడు. ఆమెకు ఆసరా నిలబడుతున్నాడు. వలంటీర్ సేవలు వెలకట్టలేనివి.

– సింహాద్రి రామలక్ష్మి, సచివాలయ కన్వీనర్, రాజవోలు

క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

ప్రకాశం నగర్: ఏపీఈపీడీసీఎల్ కొంతమూరు ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. శశి స్కూల్, రెవెన్యూ కాలనీ, గాయత్రీ నగర్, ఎస్‌బీఐ కాలనీ, స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం, చౌడేశ్వర్ నగర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

సెంట్రల్ జైలు సందర్శన



సెంట్రల్ జైలును పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: కేంద్ర కారాగారాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి బుధవారం సందర్శించారు. అక్కడి ఆసుపత్రిలో సదుపాయాలను పరిశీలించి, ఖైదీలతో మాట్లాడారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ నియమించిన పారాలీగల్ వలంటీర్లు అందుబాటులో ఉంటారని, ఏ విధమైన న్యాయ సలహాలు కావాలన్నా వారి ద్వారా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మాదక ద్రవ్యాల కేసుల్లో శిక్షలు తీవ్రంగా ఉంటాయని, వాటికి బెయిల్ లభించడం చాలా కష్టమన్నారు. ఖైదీలు పరివర్తన చెంది అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు.

21న క్యాంపస్ ఇంటర్వ్యూలు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం దివీస్ ల్యాబోరేటరీస్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామ చంద్రరావు బుధవారం తెలిపారు. ప్లేస్‌మెంట్ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఈసుబ్ బాషా షేక్ మాట్లాడుతూ 2020, 22, 23 సంవత్సరాల్లో బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీఫార్మసీ, బీటెక్ కెమికల్, ఎంఫార్మా ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 97059 64213 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

28న ఆలయ భూములకు కౌలు వేలం

కడియం: స్థానిక భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయ భూములకు ఈ నెల 28వ తేదీన కౌలువేలం జరుగుతుందని ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. కడియపులంక రెవెన్యూ పరిధిలోని 9.15 ఎకరాలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తికల రైతులు రూ.పదివేలు డిపాజిట్ చెల్లించి, ఆరోజు ఉదయం 10 గంటలకు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

డయాలసిస్ కోర్సుకు అడ్మిషన్లు

కంబాలచెరువు: స్థానిక నివ్య పారా మెడికల్ కళాశాలలో 2023 – 24 విద్యాసంవత్సరానికి రెండేళ్ల డిప్లమో ఇన్ డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని నివ్య కాలేజీ డైరెక్టర్ పి.ఎర్నెస్ట్ మోజెస్ తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. వివరాలకు 98853 68855 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో మూడో రోజు బుధవారం డీఈఈసెట్ 2023 సర్టిఫికెట్ల పరిశీలనకు 19 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ డా.ఎస్‌డీవీ రమణ తెలిపారు. సర్టిఫికెట్లు పరిశీలన అనంతరం వారికి ఫైనల్ అడ్మిషన్ లెటర్లు అందజేశామన్నారు.

మోదీ పాలనపై ప్రజల అసంతృప్తి

ప్రకాశం నగర్: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనపై ప్రజలు విసిగిపోయారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సోడదాసి మార్టిన్ లూథర్ అన్నారు. స్థానిక దేవీచౌక్ సమీపంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా కేరళ మాజీ ముఖ్యమంత్రి ఉమెన్ చాందీ మృతికి సంతాపం తెలిపారు. అనంతరం మార్టిన్ లూథర్ మాట్లాడుతూ దేశ ప్రజలు కాంగ్రెస్ పాలన కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఎన్నికలు అతి దగ్గరలో ఉన్నందున జిల్లాలోని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, తమ కమిటీలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, డాక్టర్ వడయార్ పాల్గొన్నారు.

కేంద్రం విధానాలపై నిరసన

ప్రకాశం నగర్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం యూనివర్సిటీ విద్యను భ్రష్టు పట్టించిందని విద్యాపరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.కిరణ్ కుమార్ విమర్శించారు. కేంద్ర విద్యావిధానాన్ని నిరసిస్తూ బుధవారం స్థానిక జాంపేట చేపల మార్కెట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

తెలుగు మహిళల పూజలు

సీటీఆర్ఐ: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, హింస తగ్గాలంటూ దేవీచౌక్‌లోని బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో బుధవారం తెలుగు మహిళలు పూజలు చేశారు. మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ పాల్గొన్నారు.

డ్రైవర్ మృతికి సంతాపం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రోజు వారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న కెల్లా శ్రీనివాసరావు హఠాన్మరణం ఆ కుటుంబానికి తీరనిలోటని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాలులో బుధవారం సంతాప సభ నిర్వహించారు.

ముఖ్యమంత్రి ఆశయానికి తూట్లు



డైట్‌లో ఉంచిన త్రీ వీలర్ స్కూటీలు

- పంపిణీకి నోచుకోని త్రీవీలర్ స్కూటీలు
- ఆరునెలలుగా ఎండకు ఎండి, వానకు తడుస్తున్న వైనం

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి దివ్యాంగుడికి త్రీవీలర్ స్కూటీ పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఏపీ దివ్యాంగుల, వృద్ధుల, హిజ్రాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏడాది క్రితం జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు పది చొప్పున 70 స్కూటీలు మంజూరయ్యాయి. వీటిని గతేడాది డిసెంబర్ మూడున పంపిణీ చేయాల్సి ఉండగా వాహనాలు రిజిస్ట్రేషన్ కాలేదని నిలిపివేశారు. అప్పటి నుంచి అవి బొమ్మూరులోని డైట్‌లో ఉంచారు. ఈ ఏడాది మార్చిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసినప్పటికీ దివ్యాంగులకు మాత్రం అందించలేదు. ప్రస్తుతం 70 త్రీవీలర్ స్కూటీలు ఎండకు ఎండి, వానకు తడుస్తున్నాయి. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు తూట్లు పొడవకుండా ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అర్హులైన దివ్యాంగులకు త్వరితగతిన త్రీవీలర్ స్కూటీలను పంపిణీ చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ కోరుతున్నారు.

జీవన నైపుణ్యాలపై వర్క్‌షాప్



శాటిలైట్ సిటీ హైస్కూల్లో జరిగిన వర్క్‌షాప్

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలపై టీచర్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు, జీవన నైపుణ్యాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. అలాగే ఉపాధ్యాయులందరికీ మ్యాజిక్‌బస్ ఫౌండేషన్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బత్తుల రాజరాజేశ్వరి, మ్యాజిక్ బస్ టీఎంవో ప్రియాంక పాల్గొన్నారు.

డైట్‌లో ముగిసిన శిక్షణ

బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో మ్యాజిక్ బస్ సౌజన్యంతో మూడు రోజులుగా జీవన నైపుణ్యాలపై వ్యాయామోపాధ్యాయులకు జరిగిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ మాట్లాడుతూ ఈ శిక్షణను ఉపయోగించుకుని విద్యార్థులకు జీవన నైపుణ్యాలను ఆటలు, కృత్యాల ద్వారా పెంచాలన్నారు.

రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న విద్యాశాఖాధికారులు

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్ నుంచి రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాల పంపిణీని బుధవారం ప్రారంభించారు. డీఐ మాట్లాడుతూ మొదటి సెమిస్టర్ పుస్తకాలను పాఠశాలలు తెరిచిన రోజే అందజేశామని, ఇప్పుడు రెండో సెమిస్టర్ పుస్తకాలను కూడా ముందుగానే విద్యార్థులకు అందిస్తున్నట్టు తెలిపారు. పౌర సరఫరాలశాఖ బియ్యం పంపిణీకి వినియోగిస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాల ద్వారా పాఠశాలలకు సరఫరా చేస్తున్నామన్నారు. ఈనెల 22వ తేదీకి రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం.సుబ్రహ్మణ్యం, సీఆర్పీలు జయంతి శాస్త్రి, పబ్బినీడి ప్రసాద్, జె.శ్రీనివాసరావు, కుమారి, నాగలక్ష్మి, కోటేశ్వరి, ఇందిర, సంపత్ పాల్గొన్నారు.

వర్జీనియా పొగాకు అమ్మకాలకు రేపు ఆఖరి రోజు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం క్లస్టర్ గ్రామాలకు శుక్రవారంతో వర్జీనియా పొగాకు అమ్మకాలకు ఆఖరి రోజు అని దేవరపల్లి టుబాకో బోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్ జీఎల్‌కే ప్రసాద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. బ్లాక్ సోయిల్ వర్జీనియా పొగాకు రైతులు తమ వద్ద ఉన్న టుబాకో బేళ్లను దేవరపల్లి టుబాకో బోర్డుకు తీసుకురావాలన్నారు. రఘుదేవపురం క్లస్టర్‌లో చినకొండేపూడి, కూనవరం, ముగ్గళ్ల, జాలిమూడి, మునికూడలి, రఘుదేవపురం, రాజంపేట, రాపాక, సీతానగరం, వెదుళ్లపల్లి గ్రామాలున్నాయన్నారు. దేవరపల్లి టుబాకో బోర్డు గోడౌన్‌లోని ఆర్ఆర్, ఎన్‌బీ బేళ్లను రైతులకు శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కాటవరం క్లస్టర్ గ్రామాల్లోని రైతులకు శనివారం ఆఖరి రోజు అని తెలిపారు.

పలువురికి పరామర్శ

రాజానగరం: నియోజకవర్గంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి బుధవారం పరామర్శించారు. స్వరూప్‌నగర్‌కు చెందిన సుంకర వెంకటసూర్యనారాయణ ఇంట జరిగిన పెద్దకర్మలో పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే తెలగంశెట్టి తులసీరత్నం చిత్రపటానికి కూడా పూలమాల వేసి, నివాళులర్పించారు. దివాన్ చెరువుకు చెందిన ఎర్రంశెట్టి సోమరాజు, అచంట సత్యనారాయణ, బెజవాడ సత్యవతి, బొమ్మ చిన్ని కుటుంబ సభ్యులను, కోరుకొండ మండలం నిడిగట్లకు చెందిన బద్దిరెడ్డి ప్రభావతి కుటుంబ సభ్యులను విజయలక్ష్మి పరామర్శించారు.

ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

ప్రకాశం నగర్: ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారం బుధవారం స్థానిక శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా రాజమహేంద్రవరం ఈస్ట్ డీఎస్పీ కిషోర్ కుమార్, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, గూడూరి రాధిక హాజరై, నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా అల్లు బాబీ, అధ్యక్షుడిగా మాద్దు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఏ.ఫణికుమార్, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఫొటో, వీడియో గ్రాఫర్ల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రింటోనిక అధినేత సత్యవరపు గోకుల మురళి, గౌరవ అధ్యక్షులు మునిని బాబులు, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: నగరానికి కూలిపని కోసం వచ్చిన జార్ఖండ్‌లోని మాఖ్గాన్‌జిల్లాకు చెందిన డోబ్రా క్రియ (25) అనే యువకుడు అనారోగ్యంతో మృతి చెందాడని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై జుబేర్ మహమ్మద్ తెలిపారు. డోబ్రాక్రియ మోరంపూడిలో నివాసం ఉంటూ ఓమేస్త్రీ వద్ద కూలి పని చేస్తున్నాడు. అతడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. బుధవారం ఉదయం నిద్ర లేవకపోవడంతో తోటికూలీలు పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై జుబేర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని, గత రాత్రి నిద్రిస్తున్న సమయంలో పరిస్థితి విషమించి మృత్యువాత పడి ఉండవచ్చని ఎస్సై జుబేర్ తెలిపారు.

21 నుంచి ఇంటింటా సర్వే నిర్వహించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో చైత్రవర్షిణి

రాజానగరం: వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ఓటర్ల నమోదు, సవరణపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి స్థానిక జీఎస్ఎల్ ఆడిటోరియంలో వీఆర్వోలు, బీఎల్ఓలకు బీఎల్ఓ యాప్, స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకూ బూత్ లెవిల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి జాబితాలో ఉన్న ఓటర్ల వివరాలపై సర్వే చేయాలన్నారు. జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓట్లు నమోదు చేయాలన్నారు. జాబితాలో డబుల్ ఎంట్రీ, నకిలీ ఓట్ల గుర్తింపు, చనిపోయిన వారి ఓట్లు తొలగింపు, డోర్ నంబరు లేకున్నా, ఒకే డోర్ నంబరులో ఎక్కువ సంఖ్యలో ఉన్నా క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన చేయాలన్నారు. దీర్ఘకాలంగా దూర ప్రాంతాలకు వెళ్లి, అక్కడే నివాసం ఉంటున్న వారి ఓట్లను వారి అభీష్టం మేరకు ఎక్కడ ఉంచేదీ తెలుసుకోవాలన్నారు. కొత్తగా నివాస ప్రాంతాలు ఏర్పడి పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉంటే, ఆయా ప్రాంతాలలో కొత్తగా పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సిఫారసు, ఓటర్ల జాబితా సవరణకు ఇది ఎంతో కీలకఘట్టమన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	హిడింబ	రంభ	రివేంజ్, రుద్రంగి
సూర్యమినీ	మిషన్ ఇంపాసిబుల్	మేనక	మిషన్ ఇంపాసిబుల్
సూర్యప్యాలెస్	బేబీ	అప్సర	బేబీ
స్వామి	హిడింబ	**నామవరం**	
అశోక	రంగబలి	వీఎస్ మహల్	హిడింబ
శివజ్యోతి	సామజవరగమన	**ధవళేశ్వరం**	
అనుశ్రీ	ఆదిపురుష్	మురళీకృష్ణ	బేబీ
రాజా	బేబీ	**కడియం**	
ఊర్వశి	నాయకుడు	వెంకటసూర్య	హిడింబ